పేటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటను జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. అందులోభాగంగా జగ్గయ్యపేట ఊర చెరువును హైదరాబాద్‌లో ట్యాంక్ బండ్, ఖమ్మంలో లకారం సెంటర్ మాదిరిగా అభివృద్ధి చేసేందుకు రూ.10కోట్లతో పనులు చేపట్టినట్లు వివరించారు.ఊరచెరువు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ చెరువు చుట్టూ గ్రీనరీ, వాకింగ్ ట్రాక్, లైటింగ్, బోటు షికారు, ఓపెన్ జిమ్ తదితర హంగులతో చెరువును అభివృద్ధిచేసి పర్యాటకులను ఆకర్షించేలా పనులు చేపడుతున్నామన్నారు. ఇందుకోసం సుమారు రూ.10 కోట్ల వ్యయం కానుందని, తమ వంతు సహకారంగా ఆల్ట్రాటెక్ వారు సీఎస్సార్ నిధుల నుంచి రూ.1కోటి, జిల్లా మైనింగ్ నిధులు నుంచి రూ.2కోట్లు కేటా యింపజేయడంతోపాటు రాబోయే నెల రోజుల్లో రూ.1 కోటి ఎస్ఎఫ్‌సీ నిధులతో గ్రీనరీ అభివృద్ధి, వాకింగ్ ట్రాక్ చుట్టూత లైటింగ్ ఏర్పాట్లు, ఓపెన్ జిమ్ కోసం టెండర్లను పిలుస్తున్నట్లు చెప్పారు. గత ఆరు నెలలుగా పనులు శరవేగంగా సాగుతున్నాయని, ఇప్పటికే చెరువు చుట్టూ కాంపౌండ్ వాల్, వాకింగ్ ట్రాక్ తదితర పనులు పూర్తయినట్లు వివరించారు.

సుందరీకరణ పనులకు శ్రీకారం..

పట్టణ పౌరుల కోసం ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ సుందరీకరణ పనుల్లో భాగంగా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ట్రాక్‌కు ఇరువైపులా అందమైన, ఆకర్షణీయమైన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఉదయభాను ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బద్దూనాయక్, పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ కన్నమాల శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.


చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

సంక్షేమాన్ని చూసే వైఎస్సార్‌సీపీలోకి వలసలు

ధర్మవరప్పాడుతండా(జగ్గయ్యపేట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో చేసిన సంక్షేమ పాలనకు ఆకర్షితులైన ప్రతిపక్ష టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. ధర్మవరప్పాడుతండాకు చెందిన టీడీపీ నాయకులు మహంకాళి గోపి, భూక్యా బాలునాయక్, కొరివి వీరన్న, దారావత్ వెంకటేశ్వర్లు, మోతీలాల్, భూక్యా శ్రీను, గుగులోతు బద్రులు తదితరులు వారి కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం రాత్రి ఉదయభాను సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించి చెప్పాడంటే చేస్తాడనేంతగా పేరు తెచ్చుకున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మంచి చేస్తూ వారి హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కన్వీనర్ భూక్యా జ్వాలా నాయక్, మండల ఎస్టీ సెల్ కన్వీనర్ రాందాసు నాయక్, మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్ గౌడ్, నాయకులు పాండురంగారావు, శ్రీరాములు నాయక్, రవీంద్ర నాయక్, సక్రు, బద్యానాయక్ పాల్గొన్నారు.


వైసీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న విప్ ఉదయభాను

నేడు గురుకుల భవనం ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని సత్యనారాయణపురంలో రూ 2.32కోట్లతో సువిశాలమైన తరగతి గదులు, ఆధునిక మౌలిక వసతివసతులతో నిర్మించిన గిరిజన సంక్షేమశాఖ బాలుర గురుకుల పాఠశాలను మంగళవారం ప్రారంభించనున్నారు. ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అధ్యక్షతన సాయంత్రం నాలుగు గంటలకు జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర హాజరై పాఠశాల నూతన భవనాలను ప్రారంభించనున్నారు.

మొత్తం రూ.2.32 కోట్ల నిధులతో సువిశాలమైన 12తరగతి గదులు, 16టాయిలెట్లు, ఒకేసారి 120 మంది విద్యార్థులు భోజనం చేసేలా డైనింగ్ హాల్, వాష్ ఏరియా, కిచెన్ నిర్మించారు. పాఠశాల ఎదుట పరిశుభ్రంగా ఉండేలా రూ.9లక్షలతో డ్రైనేజీ కాల్వ, కల్వర్టు నిర్మాణం చేపట్టారు.

వైఎస్ సర్కిల్ నుంచి బైక్ ర్యాలీ ..

ఉపముఖ్యమంత్రి పి.రాజన్నదొర పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో కోరింది. ఉపముఖ్యమంత్రి జగ్గయ్యపేటకు వస్తున్న సందర్భంగా ఆయనకు ఘనస్వాగతం పలికేందుకు స్థానిక చిల్లకల్లు రోడ్‌లోని వైఎస్ సర్కిల్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి బైకు ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ, గ్రామాల ముఖ్య నాయకులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, అభిమానులు, సోషల్ మీడియా కన్వీనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.


ప్రారంభానికి సిద్ధమైన గురుకుల బాలుర పాఠశాల భవనం

మిర్చి తోటల పరిశీలన

వత్సవాయి: మిర్చి రైతులు జెమినీ వైరస్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి బి.బాలాజీకుమార్ సూచించారు. మండలంలో భీమవరం, మక్కపేట, ఇందుగపల్లి గ్రామా ల్లోని మిర్చి తోటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. జెమినీ వైరస్ సోకి పంట నష్టపోయిన రైతులు, తిరిగి మిర్చి నారును నాటుకునే సమయంలో నారును ఇమిడాక్లోప్రైడ్ లేదా వేపనూనెలో ముంచి నాట్లు వేస్తే మంచిదన్నారు. అలాగే వేపపిండి ఎకరాకు క్వింటా చొప్పున చల్లుకోవాలన్నారు. ఇప్పటికే ప్రైడ్ పిచికారీ చేసిన రైతులు పదే పదే అవే రకాల మందులను వాడకుండా ఉండాలన్నారు. మార్కెట్లో దొరికే మందులను విచ్చలవిడిగా పిచికారీ చేసి నష్టపోవద్దన్నారు. పంటసాగుకు సంబంధించి ఎప్పటికప్పుడు గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న ఉద్యానవశాఖ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ ఉద్యానవనశాఖాధికారి టి.వర్ధినీకుమారి, సిబ్బంది దివ్య పాల్గొన్నారు.


మక్కపేటలో రైతులతో కలిసి మిర్చి తోటను పరిశీలిస్తున్న డీహెచ్‌వో బాలాజీ

ముమ్మరంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు

పెనుగంచిప్రోలు: మండలంలో అన్ని గ్రామాలకు 24గంటలు విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా ఉండేందుకు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు చేపట్టిన విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని పెనుగంచిప్రోలు, నవాబుపేట, అనిగండ్లపాడు గ్రామాలకు మాత్రమే 24గంటలు విద్యుత్ సరఫరా ఉండేందుకు అవసరమైన విద్యుత్ లైన్ సౌకర్యం ఉంది. అయితే తాజాగా సుబ్బాయిగూడెం నుంచి శనగపాడు వరకు, పెనుగంచిప్రోలు నుంచి లింగగూడెం వరకు, ముండ్లపాడు గ్రామాలకు కూడా 24 గంటలు విద్యుత్ అందుబాటులో ఉండేందుకు కొత్తగా 350 విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ పెనుగంచిప్రోలు ఏఈ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ కొత్తగా విద్యుత్‌స్తంభాలు, లైన్ల ఏర్పాటు పనులు నవంబరు నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న లైన్లు 24 గంటలు సప్లయి ఉన్నా రూరల్ ఫీడర్, వ్యవసాయ శాఖ కనెక్షన్ల కింద ఉండటంతో కొన్ని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. కొత్తగా త్రీఫేజ్ విద్యుత్‌తో కొత్తగా లైన్ ఏర్పాటు చేస్తుండటంతో ఇబ్బందులు తొలగుతాయన్నారు. మండలంలో అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తామని వివరించారు.


సుబ్బాయిగూడెం-కొళ్లికూళ్ల మధ్యలో కొత్తగా వేసిన విద్యుత్ స్తంభాలు

స్పందన ద్వారా ఎనిమిది అర్జీలు

నందిగామ: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమం ద్వారా మొత్తం ఎనిమిది అర్జీలు అందాయని ఆర్డీవో రవీంద్రరావు తెలిపారు. డివిజన్ పరిధిలో రెవెన్యూ సమస్యలకు సంబంధించి రెండు అర్జీలు, ఇంటి సమస్యలకు సంబంధించి రెండు, పోలీస్ శాఖ, గ్రామీణ నీటిపారుదల శాఖ, మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించి ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఎనిమిది అర్జీలు అందినట్లు ఆర్డీవో వివరించారు.

చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు

పెద్దాపురం(వీరులపాడు): మద్యం అక్రమ రవాణాకు పాల్పడితే సహించేది లేదని ఎస్‌ఐ మహాలక్ష్మ ణుడు హెచ్చరించారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సమీపంలోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద సోమవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణా ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. ముఖ్యంగా మద్యం అక్రమ రవాణాపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉక్కుపాదం మోపుతున్నట్లు వివరించారు. తనిఖీలలో భాగంగా తెలంగాణా నుంచి అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తి వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు నందిగామ, పేట కౌన్సిల్ సమావేశాలు

నందిగామ: నందిగామ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ వరలక్ష్మి అధ్యక్షతన ఉదయం 11గంటలకు జరిగే ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, ఎక్స్‌అఫిషియో సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు. సమావేశంలో 34 అంశాలపై చర్చించి తీర్మానం చేయనున్నట్లు కమిషనర్ జయరాం తెలిపారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్ : పేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఉదయం 11గంటలకు జరిగే సమావేశంలో అభివృద్ధి పనులు, పరిపాలనకు సంబంధించిన కేటాయింపులు తదితర 71అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం సిద్ధం చేసినట్లు వివరించారు. కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫిషియో సభ్యులు హాజరు కావాలని కోరారు.

కృతజ్ఞతాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

జగ్గయ్యపేట అర్బన్: నవంబర్ రెండో తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటుచేసిన బుడగ జంగాల కృతజ్ఞతాసభ నేపథ్యంలో రూపొందించిన వాల్ పోస్టర్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సోమవారం ఆవిష్కరించారు. స్థానిక ఊర చెరువు వద్ద జరిగిన కార్యక్రమంలో చిల్లకల్లు జంగాల కాలనీకి చెందిన పలువురితో కలసి ఆయన సభ వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో అన్ని కులాల వారిని గుర్తించి వారి సంక్షేమానికి కృషి చేస్తూ సామాజిక న్యాయాన్ని, ధర్మాన్ని పాటించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే నన్నారు. అసెంబ్లీలో బేడ(బుడగ) జంగం కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని తీర్మానించి కేంద్రానికి పంపించినందుకుగాను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపేందుకు రాష్ట్ర బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎలమర్తి మధు ఆధ్వర్యంలో ఈ సభ ఏర్పాటు చేస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు పెళ్లూరి వెంకటేశ్వర్లు వివరించారు. కృతజ్ఞతాసభను జయప్రదం చేయాలని వెంకటేశ్వర్లు కోరారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బద్దూనాయక్, పెనుగంచిప్రోలు సచివాలయాల కన్వీనర్ శామ్యూల్ పాల్గొన్నారు.


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

9న బహిరంగ వేలం

అంబారుపేట(నందిగామ టౌన్): మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయ ఆవరణలో నవంబరు తొమ్మిదిన ఉదయం 11గంటలకు పలు టెండర్ కం బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు, ఈవో సీతారామయ్య తెలిపారు. ఆలయ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ కొబ్బరికాయలు, నిమ్మకాయలు, పూజా ద్రవ్యాలు, భక్తులు సమర్పించే వస్త్రములు వసూలు చేసుకునే హక్కుకు వేలం పాటలు జరుగుతాయని తెలపారు.వేలం పాటలు దేవాదాయ శాఖ నిబంధనలకు అనుగుణంగా జరుగుతాయని ఆసక్తి కలిగినవారు పాల్గొనాలని వారు కోరారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

వీరులపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికి పనులు కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్‌అసిస్టెంట్లపై ఉందని ఎంపీపీ కోటేరు లక్ష్మి సూచించారు. మండలంలోని పెద్దాపురం, దొడ్డదేవరపాడు, అల్లూరు, వీరులపాడు గ్రామాల్లో 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన పనులపై సోమవారం సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ గ్రామాల్లో ఏడాదికాలంగా రూ.7కోట్ల విలువగల పనులు చేపట్టినట్లు వివరించారు. కొలతల్లో అవకతవకలకు తావు ఉండకూడదని ఫీల్డ్‌అసిస్టెంట్లను హెచ్చరించారు. మస్టర్లు సజావుగా నమోదు చేసి పనికి తగ్గ వేతనం కల్పించాలని వారికి సూచించారు. సర్పంచ్‌లు బందెల రాణి, నిప్పులపల్లి శాంతమ్మ, చెంద్యాల రామకృష్ణ, కన్నమాల సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు తోట నారాయణరావు, మోంద్రు బాయమ్మ, ఏపీవో జనార్దన్, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలి

నందిగామ: బ్యాంకులు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని ఆర్డీవో ఎ.రవీంద్రరావు సూచించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన కరూర్ వైశ్యా బ్యాంక్ నూతన బ్రాంచిని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ బ్యాంకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

రిటైర్డ్ డీసీఓ బైరామ్మూర్తి మృతి

ఇబ్రహీంపట్నం: ఉమ్మడి కృష్ణా రిటైర్డ్ జిల్లా కో–ఆపరేటీవ్ అధికారి నెల్లం బైరామ్మూర్తి (65)అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. తూర్పుగోదావరి జిల్లా అమలాపురం సమీపంలో తోపుకూరు ఈయన స్వగ్రామం. ఉద్యోగరీత్యా 2000వ సంవత్సరం సహకారశాఖ డిప్యూటీ రిజిస్ట్రార్‌గా విజయవాడకు బదిలీపై వచ్చారు. అనంతరం డీసీఓగా బాధ్యతలు నిర్వహిస్తూ, ఇక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని 2019లో రిటైర్డు అయ్యారు. ఇటీవల అనారోగ్యానికి గురై ఆయన హైదరాబాద్ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్సపొందుతూ తుదిశ్వాస విడిచారు. ఉద్యోగులు, బంధువులు ఆయనకు నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం మృతదేహాన్ని విజయవాడ నుంచి తోపుకూరుకు తరలించారు.


బైరామ్మూర్తి (ఫైల్)

పైతాన్ ప్రోగ్రామింగ్‌కు ప్రాధాన్యం

మైలవరం: ప్రస్తుతం పెరుగుతున్న టెక్నాలజీలో పైథాన్ ప్రోగ్రామింగ్ ఆవశ్యకత ఎంతో ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం బీటెక్ విద్యార్థులకు డేటా సైన్స్ యూజింగ్ పైతాన్‌పై వారం రోజులు నిర్వహించే వర్క్‌షాపును సోమవారం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ కళాశాలలో నిర్వహిస్తున్న వర్క్‌షాపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధునిక ప్రపంచంలో పెరుగుతున్న టెక్నాలజీలో డేటా సైన్స్ యూజింగ్ పైతాన్ ఆవశ్యకత పెరిగిందన్నారు. హైదరాబాద్‌కు చెందిన బ్రెయిన్ ఓ విజన్ సాఫ్ట్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ డీ వీరయ్య, ఏఐ అండ్ డీఎస్ విభాగాధిపతి డాక్టర్ ఓ రమాదేవి, ఏఐ అండ్ ఎంఎల్ విభాగాధిపతి ఎస్.జయప్రద, డీన్ అకాడమిక్స్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ డేటా సైన్స్ యూజింగ్ పైతాన్ ఆవశ్యకత ప్రాముఖ్యత, ప్రస్తుత టెక్నాలజీలో పైతాన్ ప్రోగ్రామింగ్ సాంకేతికతను వివరించారు. రిసోర్స్‌పర్సన్స్‌గా ట్రైనర్ అండ్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ వీఎస్ పవన్, టెక్నికల్ హెడ్ బి.విజయకుమార్, సీనియర్ డేటా సైన్స్ ఇంజినీర్ యశస్వి సురభి ప్రసంగించారు. సొసైటీలో ఉన్న ప్రాబ్లమ్స్‌ని సాల్వ్ చేయడంలో వెబ్, డెస్క్‌టాప్ అప్లికేషన్స్ అభివృద్ధిలో డేటా సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు.


వర్క్‌షాపులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

ప్రకృతి వ్యవసాయ పంటలతో ఆరోగ్య సంరక్షణ

చాట్రాయి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు ఆరోగ్యానికి ఎంతో దోహదపడదాయని తహశీల్దార్ విశ్వనాధరావు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ పంటల ప్రదర్శన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రసాయనిక ఎరువుల ద్వారా పండించిన పంటలను తినడం వలన అనారోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని, రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలని ఆయన కోరారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలైన కాయకూరలు, ఆకు కూరలు, బెల్లంను సిబ్బంది విక్రయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దుర్గా ప్రసాద్, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

ముసునూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించి, మద్యం కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం ముసునూరుకు చెందిన వీరంకి నాగరాజు, కంచర్ల ఏసుబాబు అక్రమంగా మద్యం నిల్వ ఉంచి, అమ్ముతున్నారనే సమాచారంతో వారి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో మొత్తం 12 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

విద్యుత్ రాగి వైర్ల చోరీలపై కేసు నమోదు

ముసునూరు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి వైరు, యాసిడ్ చోరీలపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. సూరేపల్లి, బాసవరప్పాడు గ్రామాలకు చెందిన యలమంచిలి శ్రీనివాసరావు, హెచ్చు కృష్ణకు చెందిన వ్యవసాయ క్షేత్రాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లలోని విలువైన రాగివైరు, యాసిడ్ ఈ నెల 12వ తేదీన చోరీకి గురైనట్లు రమణక్కపేట విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ శ్రీనివాస్‌కు ఫిర్యాదులు అందాయి. వీటిపై శాఖాపరమైన విచారణ, వాంగ్మూలం స్వీకరించిన అనంతరం ఏఈ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఏఈ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ చెప్పారు.

రైల్వేస్టేషన్‌లో సదుపాయాలు కల్పించాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వందేళ్ల చరిత్ర కలిగిన కొండపల్లి రైల్వే స్టేషన్‌లో సదుపాయాలు కల్పించాలని స్టేషన్ అధికారులకు సోమవారం ప్రయాణికులు వినతిపత్రం అందజేశారు. ఇబ్రహీంపట్నంకు చెందిన కొనకాల ఆనంద్, నరసింహారావు మరికొంతమంది గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌కు వెళ్లేందుకు ఉదయం రైల్వే స్టేషన్‌కు వచ్చారు. వారిలో కొందరు దివ్యాంగులు, వృద్ధులు ఉండడంతో స్టేషన్ ప్లాట్‌ఫారాలకు చేరుకునేందుకు ఫ్లైఓవర్ వంతెన మెట్లు ఎక్కలేక ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు స్టేషన్ టాయిలెట్స్‌లో నీరు, తాగునీరు సదుపాయం కూడా లేదని గుర్తించారు. సదుపాయాలు కల్పించి వృద్ధులు, దివ్యాంగులకు లిఫ్ట్ ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు.

ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

మైలవరం: నవంబర్ 3న జరిగే స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే సందర్భంగా జీ కొండూరు మండలంలో వివిధ పాఠశాలల్లో జరుగు సర్వేలో ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా పాల్గొనేందుకు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 40మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఎంపిక చేసినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీ రంగారావు తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం వైస్ ప్రిన్సిపాల్ రంగారావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం నిమిత్తం జి.కొండూరు మండలంలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ వి.ఫణికుమార్, ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నే స్వామి పాల్గొన్నారు.

కరాటే విజేతలకు అభినందన



తిరువూరు: గుంటూరు జిల్లా మంగళగిరిలో షోటో రై జపాన్ సంస్థ ఆదివారం నిర్వహించిన 8వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తిరువూరుకు చెందిన హర్షా కరాటే ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. సీనియర్స్ బాలికల విభాగంలో యోషిత, జూనియర్స్ బాలుర విభాగంలో రిషిక్ రామ్ ప్రథమ స్థానాలు సాధించినట్లు కోచ్ నాగేశ్వరరావు తెలిపారు. జూనియర్స్ కుమిటీ విభాగంలో హర్షిత్, జూనియర్స్ కట్టా బాలికల విభాగంలో సంహిత, రాజేశ్వరి, చైతన్య విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. విజేతలను తిరువూరు పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

క్లుప్తంగా

ప్రతిభ చూపిన కేవీఆర్ విద్యార్థులు



పెనుగంచిప్రోలు: ఉమ్మడి కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో నిర్వహించిన బాల్‌బ్యాడ్మింటన్ సెలక్షన్స్‌లో స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు గజ్జి గౌతమ్, బొడ్డు అఖిల్‌ను హెచ్ఎం కె.జలజ, పీడీ వేగినేటి వెంకటరమణ, జి.బాబుప్రసాద్, టీచర్లు అభినందించారు.

580 మందికి వైద్య పరీక్షలు



తొర్రకుంటపాలెం(జగ్గయ్యపేట): మండలంలోని తొర్రకుంటపాలెంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు అనిల్‌కుమార్, స్రవంతి, నాగరాణి, మోబిన్ అహ్మద్, సుధాకర్ 580మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమేష్‌బాబు మాట్లాడుతూ నెల రోజులుగా మండలంలోని 21సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కింద ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పూసల పుల్లారావు, బాలస్వామి, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, హెల్త్ సూపర్‌వైజర్ వెంకట్రావ్, అలివేలమ్మ, వైద్యారోగ్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి కౌలురైతు ఆత్మహత్య


నరేంద్ర (ఫైల్)

నందిగామ: అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన నందిగామ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం నందిగామ మండలం కొత్త బెల్లంకొండవారి పాలెం గ్రామానికి చెందిన పెమ్మసాని నరేంద్ర (41) గ్రామంలో రెండెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగు చేసి నష్టపోవడంతో అప్పులపాలయ్యాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి పురుగు మందు తాగగా, గమనించిన కుటుంబసభ్యులు ఆయన్ను వెంటనే నందిగామ ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే నరేంద్ర మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

షాపుల అద్దెల ద్వారా రూ.4.91లక్షల ఆదాయం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామివారికి రెండు షాపుల అద్దె వేలం ద్వారా రూ.4.91 లక్షల ఆదాయం వచ్చిందని ఇన్‌చార్జ్ ఏసీ జయప్రకాష్‌బాబు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో కొండపైన నూతనంగా నిర్మించిన రెండు షాపులకు సోమవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. వేదాద్రికి చెందిన తూమాటి నాగేశ్వరరావు రూ. 2.10 లక్షలు, తిరుమలగిరికి చెందిన ఇమ్మడి వెంకటేశ్వరరావు రూ. 2.81లక్షలకు హెచ్చుపాటతో షాపులను అద్దెకు తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్మృతివనం పనుల పరిశీలన



పటమట(విజయవాడతూర్పు): స్మృతివనం పనులను కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం పరిశీలించారు. స్మృతివనం పనుల కోసం వందలాది మంది కార్మికులు భారీ యంత్రాలతో నిరంతరం పనులను కొనసాగిస్తున్నారని చెప్పారు. ఢిల్లీ నుంచి వచ్చిన స్మృతివనం నిర్మాణ డిజైన్ల ఆధారంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనుల్లో వేగం పెంచామని తెలిపారు. సీలింగ్, ప్లాస్టింగ్ పనుల్లో జాప్యం లేకుండా పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పనుల నాణ్యతా ప్రమాణాలను క్వాలిటీ కంట్రోల్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. గ్రానైట్, ఫుట్ పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ నిర్మాణం తుది దశకు చేరుకుంటున్నాయని పేర్కొన్నారు. పార్కింగ్ ఏరియా సిద్ధం చేస్తున్నామని, ఈ ప్రాంగణంలో అందమైన రకరకాల పూలు, ఆకర్షణీయమైన మొక్కలతో గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.